
# వంతెన

- ముద్దూరు శ్రీనివాసులు




## 'ఏదేమైనా సరే!... ఈ రోజు అటో ఇటో తేల్చెయ్యాలి'—

ఈ మాట బైటకి చెప్పకున్నా ఆ పడవలో వున్న దాదాపు ఇరవై మంది అభిప్రాయం ఇదే.

నాలుగు గ్రామాల పెద్దలు, ఆయా గ్రామాల ప్రముఖులు తాము ఈసారి ఎమ్మెల్యే గారికి చెప్పేయాల్సిన సంగతంతా సూటిగా, స్పష్టంగా చెప్పెయ్యాలని రెండ్రోజుల ముందుగానే నిర్ణయించేసుకున్నారు.

సూరిబాబంటే కేవలం ఎమ్మెల్యేనే కాదు, ఆ ప్రాంతంలో పేద్ద మీసాలున్న భూస్వామి, ముఠా నాయకుడు కూడా. భారీ అనుచరగణం, తుపాకులు చేతపట్టిన సొంత సైన్యం లేకుండా గడప దాటరాయన. అసలే ముక్కోపి. కోపం వస్తే వెనకా ముందూ చూడడని ఆ ప్రాంత వాసులకి అనుభవైకవేద్యం. ఆ ప్రాంతంలో ఆయన మాటే శిలాశాసనం. ఎదురు తిరిగితే శిరో ముండనం తప్పదు. 'అయినాసరే! ఈ రోజు అటో ఇటో తేల్చేయ్యాలి' అనుకున్నారు పడవెక్కినవారంతా.

సూరిబాబు గంగాపురంలో తన స్వగృహానికి వచ్చి వున్నారని తెలియగానే అంతా కూడగట్టుకుని పడవెక్కారు. తుంగభద్రలో పడవ మెల్లగా సాగిపోతోంది. చేసిన వాగ్దానాల గురించి పట్టించుకోని రాజకీయనాయకుని మనస్తత్వంలా నదిలో నీళ్లు నిమ్మళంగా వున్నాయి. పై నుంచి ఆర్డర్స్ లేకుండా తాము చేయగలిగిందేమీ లేదని చేతులెత్తేసే అధికార యంత్రాంగంలా... ఆకాశం.

తెల్లవారి కొద్దిసేపే అయింది.

గంగాపురం వెళ్ళాలంటే తుంగభద్రలో ఆరు కిలోమీటర్లు ప్రయాణం చేసి, అవతలి గట్టు వైపు నుంచి తాటితోపుల మధ్య కాలిబాటలో మరో మూడున్నర కిలోమీటర్ల దూరం నడవాలి. మండల కేంద్రమైన సిరిపురం నుంచి తుంగభద్ర అవతలి గట్టుకు వెళ్ళాలంటే మరో దారి వుంది కానీ అది కనీసం పాతిక కిలోమీటర్లయినా చుట్టు చుట్టుకుని రావాలి. ఆ రోడ్డు కూడా... ఎన్నికలప్పుడు వినిపించే రాజకీయోపన్యాసంలా అత్యంత దారుణంగా వుంటుంది. రెండు మూడడుగుల లోతు గల గుంతలు గజానికొకటో, రెండో దారి పొడవునా వుంటాయి.

ఎమ్మెల్యేగారి కారూ.. అడపాదడపా ఆయన అనుచరుల వాహనాలు ఎక్కువగా ఆ గుంతల- గతుకుల రోడ్డు మీదనే రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ రోడ్డు బాగు చేయిస్తే సుమారు ఎనిమిది గ్రామాల ప్రజలకు కాళ్ళ తిప్పట వుండదు... కానీ సూరిబాబు మాత్రం ఆ విషయాన్ని ససేమిరా పట్టించుకోరు.

"ఈసారి ఏదైమైనా సరే!... మనమంతా సూరిబాబును నిలదీయాలండీ!" అన్నాడు భూషణం.

పడవలోని వారంతా "ఔనౌను. నిలదీయాల్సిందే" అన్నారు ముక్తకంఠంతో.

"నిలదీయకపోతే ఆయన మన మాట వినరు. చూద్దాం... చేద్దాం అంటారు. ఈలోగా ఎన్నికలైపోతాయి. అందుకనే గట్టిగా అడగాలి" - అన్నాడు భూషణం.

పడవలోని వారంతా "ఔనౌను... గట్టిగా అడగాల్సిందే"- అన్నారు వంత పాడుతున్నట్లుగా.

"అయినా!... నాకు తెలీకడుగుతా... మూడుసార్లు వరుసగా ఆ సూరిబాబునే మనం గెల్పించినాం కదా.. ఆ గంగాపురం రోడ్డు అంత దౌర్భాగ్యంగా వున్నా ఆయనెందుకు పట్టించుకోరు?!" అమాయకంగా ప్రశ్నించాడు మాధవపురం సర్పంచ్ మాధవయ్య.

"నువ్వేం సర్పంచ్‌వయ్యా బాబూ!... ఆ రోడ్డు బాగు చేయిస్తే ఆ చుట్టుపక్కలున్న ఎనిమిదూళ్ళలో ఆయనకు కాలం చెల్లినట్లే... ఒక్కడూ ఆయనకు ఓటు వెయ్యడక్కడ... ఎన్నికలలో భారీ బందోబస్తు పెట్టేసి రిగ్గింగ్ జరక్కుండా చూస్తారు. ఇప్పడయితే ఈ మారుమూల పల్లెటూళ్ళకి పోలీసులు రావాలన్నా నానా యాతనలూ పడి రావలసిందే. ఒకవేళ వచ్చినా వాళ్ళనెలాగో మాయ చేసేసుకుని ఓట్లు గుద్దేసుకుంటాడాయన. రోడ్డు బాగయిందనుకో... ఏ చిన్న గలాటా జరిగినా పోలీసు వ్యాన్లు వెంటనే పరిగెత్తిరాకుండా సూరిబాబే రోడ్డంతా గుంతలు తీయించాడు- తెలియదా!"... భూషణం ధైర్యంగానే అసలు కథ వివరించాడు.

"రోడ్డు సంగతి తర్వాత... ముందు మన నాలుగూళ్ళకీ ఈ తుంగభద్ర దాటాలంటే వంతెన అవసరం. దానికి పది లక్షల దాకా అవుతుందట. ఎస్టిమేషన్లు రెడీగానే వున్నాయి. సూరిబాబు తల్చుకుంటేనే గానీ పని ప్రారంభం కాదు. రోజూ స్కూల్ పిల్లలు గంగాపురం వెళ్ళాలంటే ఈ తుంగభద్రలో గుండెలు అరచేత పట్టుకోవలసి వస్తోంది. ముందు వెంటనే వంతెన కట్టాలని బల్లగుద్ది చెప్దాం" మరో వ్యక్తి అందుకున్నాడు.

"ఔనౌను... బల్ల గుద్ది చెప్పాల్సిందే"- మిగతావారు.

"ఆ వుండే ఆస్పత్రి కూడా గంగాపురంలోనే వుంది... మొన్నోసారి మా వూళ్ళో వెంకటసుబ్బమ్మకి ఛాతీ నొప్పి వస్తే.. ఈ గోదారి దాటి గంగాపురం మొగుదాల్లోకెళ్ళేసరికి హరీమంది" శివపురం ప్రముఖుడొకరు ఆవేదనగా చెప్పారు.

"అయ్యయ్యో!! ప్చ్!... ప్చ్!... ప్చ్!!"- సానుభూతి చూపారు మిగతావారు.

"అందుకే వంతెన ముఖ్యం. ప్రజలకీ, ప్రభుత్వానికీ మధ్య వంతెనలా వుండాల్సిన ప్రజా ప్రతినిధులు ప్రజల గోడు పట్టించుకోకపోవడం వల్లనే మన కర్మలిలా తయారయ్యాయి. ఈసారి తాడోపేడో తేల్చేద్దాం... అప్పటికీ ఆయనలో చలనం లేకపోతే అన్ని గ్రామాల ప్రజలందరం కలసి చందాలు వేసుకుని మనమే వంతెన కట్టేసుకుందాం... బాగుందా ఈ ఆలోచన" – అడిగాడు భూషణం.

"ఔనౌను!... బాగుంది... బాగుంది" అన్నారంతా.

భూషణం స్వచ్ఛంద. సేవకుడు కావడంతో అతనంటే ఆ పల్లెటూర్లలో ప్రజలకు మంచి విశ్వాసం. అతని మంచితనం, సేవాభిలాష ఆ ప్రాంతాలలో నాయకులకు కూడా తెలిసిందే. భూషణం రాజకీయాల్లోకి వచ్చే వ్యక్తి కాదు కనుక, అతనంటే అందరికీ ఎంతో కొంత గౌరవం.

తుంగభద్ర అవతలి గట్టు వచ్చేసింది. అందరూ పడవ దిగి నడక ప్రారంభించారు. సూరిబాబు ఇల్లు దగ్గరయ్యే కొద్దీ అందరిలో ఒక రకమైన భయం ఆవరిస్తోంది. వీరంతా వెళ్ళేసరికి సూరిబాబు తన పద్దాలుగేళ్ళ ముద్దుల కుమారునికి తుపాకీ కాల్చడం నేర్పుతున్నాడు. భూషణాన్ని చూడడంతోనే... "ఏమిటీ! అందరూ కట్ట కట్టుకుని వచ్చారూ"- అన్నాడు చిరాగ్గా సూరిబాబు.

"గంగాపురం వంతెన కోసం వచ్చామండీ"- అన్నాడు భూషణం ధైర్యం చేసి.

"దానికిప్పుడు తొందరేమొచ్చిందీ!... గోదావరి పుట్టినప్పట్నుంచీ గంగాపురంకి పడవలు వస్తున్నాయి కదా?..." చాలా తాపీగా అడిగాడు సూరిబాబు.

"వరదొస్తే... ఇబ్బంది కదా... అనీ..." – భూషణం.

"వరదొస్తే వంతెనలాగుతాయా!... తగ్గేదాకా గంగాపురం రాకుంటే సరి" అన్నాడు సూరిబాబు మిగతావారి ముఖాలు పరిశీలనగా చూస్తూ.

"ఔనౌను! అంతేమరి... రాకుంటే సరి!" అన్నారంతా అప్రయత్నంగా.

సూరిబాబు తనలో తనే నవ్వుకుని, కుమారునికి తుపాకీ కాల్చడం నేర్పడంలో నిమగ్నమై పోయాడు

చేసేదేమీ లేక భూషణం, తదితరులంతా తిరుగు ప్రయాణమై పడవెక్కారు.

"మీరంతా ఆయన్ను నిలదీస్తామని డాంబికాలు పలికారు. ఒక్కరూ పెదవి విప్పలేదేం" కోపంగా అడిగాడు భూషణం.

"ఆ సూరిబాబు అసలే దుర్మార్గుడు... అయినా ఇంతకాలం లేని వంతెన ఇప్పుడు లేకపోతేనేం?!"... అన్నాడు శివపురం సర్పంచ్ నీళ్ళు నవుల్తూ.

భూషణం నిరుత్తరుడయ్యాడు.

ఆ మాట బైటకి చెప్పకున్నా మిగిలిన వారి మనసుల్లోని అభిప్రాయం కూడా అదే.



గుడియైనా, గోపురమైనా
మందిరమైనా, మసీదు అయినా
మనుషులే కదా, కట్టిందీ
దేవుణ్ణి సిలుచో పెట్టిందీ
నరుని భక్తికే నారాయణుడూ
శివాలయమైనా, శిథిలాలయమైనా
నిజరూపంలో వచ్చాడూ
మట్టిబొమ్మలో యిమిడాడూ

— షేక్ ఖాసిమ్


విజయవాడలో మీ సొంత ఇంటి కలలకు నిజరూపం



**శ్రీ గాయత్రీదేవి హౌసింగ్ ప్రై. లిమిటెడ్** ఫోన్: 481384

సిద్ధార్థ ఉమెన్స్ కాలేజీ రోడ్, బందర్ రోడ్, లబ్బీపేట, విజయవాడ-10.

విజయవాడ రియల్ ఎస్టేట్స్ రంగంలో సంచలనం

శ్రీ గాయత్రీ హౌసింగ్ స్కీమ్‌లో సభ్యత్వం పొందండి రూ. 1 లక్ష విలువైన ఇల్లు ఉచితంగా పొందండి.

**గాయత్రీ నగర్ ప్రత్యేకతలు :**

- విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి అతి దగ్గరగా
- భవానీపురం APHB కాలనీకి చేరువలో
- భవానీపురం స్టీల్ మార్కెట్ యార్డ్ ఎదురుగా
- స్కూల్, కాలేజీలకు దగ్గరగా
- VGT UDA వారి నిబంధనలకు అనుగుణంగా
- విశాలమైన రోడ్లు, రోడ్ల కిరువైపులా చెట్లు
- డ్రైనేజి సౌకర్యాలు
- మంచినీటి సౌకర్యాలు
- గ్రంథాలయం కమ్యూనిటీ హాలు ఏర్పాటు
- నగరానికి సిటీబస్ సౌకర్యాలు
- VGTA No : C5 1359/94 C5/1690/95



శ్రీ ఎమ్. వి. వి. సత్యనారాయణ

రియల్ ఎస్టేట్ రంగంలో అపార అనుభవం గడించిన వారిచే నడుపబడుచున్న సంస్థ

ప్రముఖ సినీనటులు కృష్ణ, శ్రీమతి విజయనిర్మల, నరేష్, దివ్యవాణి, జంధ్యాల, అమ్మదొంగా ప్రొడ్యూసర్, సుధాకర్‌బాబు, మౌళి, ఇంకా అనేక మంది ప్రముఖ నిర్మాతలు, నటులు ప్లాట్స్ కొనుగోలు చేసిన సంస్థ ఇది.

మొదటి డ్రా విజేత : కె. వీరారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, నంది పైప్స్, నంద్యాల. కలర్ టి.వి.

రెండవ డ్రా విజేత : వి. రేణుక, సికింద్రాబాద్ బహుమతి : బజాజ్ స్కూటర్

K.Y.V.V రామకృష్ణ, కంచికచెర్ల బహుమతి : బజాజ్ స్కూటర్